క్లుప్తంగా

లక్కమారికాపు మండల కమిటీ ఎన్నిక

ఆత్మకూరు : లక్కమారికాపు మండల కమిటీ ఎన్నిక ఆదివారం మండలంలోని అగ్రంపహాడ్‌లో జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా చెంచు ప్రభాకర్, అధ్యక్షుడిగా పెండ్లి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా పెండ్లి రాజు, ప్రధాన కార్యదర్శిగా గోనే రాజు, సహాయ కార్యదర్శిగా ఎరుకల సుమన్, కోశాధికారిగా రాజేందర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. లక్కమారికాపుల హక్కుల కోసం పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి అనుముల నర్సిరెడ్డి, గోనె రవి, నాయకులు తిరుపతి, రవీందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా



ఆత్మకూరు : బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన భాష బోయిన రవి, పెంచికలపేటలో అనారోగ్యంతో మృతిచెందిన అచ్చాలు కుటుంబాలను ఆదివారం ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ తరుపున అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సంజీవరెడ్డి, బొల్లోజు కుమారస్వామి, నాయకులు సుధాకర్, సాగర్, అంకూస్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శలు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆకుతోట యాకయ్య తండ్రి ఆకుతోట బుచ్చయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. బుచ్చయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే రాంనగర్ గ్రామానికి చెందిన నందనం సొసైటీ మాజీ అధ్యక్షుడు బోయినపల్లి లక్ష్మీనరసింహారావు అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా పరామర్శించారు. మండల నాయకుడు సమ్మయ్య, మాజీ సర్పంచ్‌లు సమ్మారావు, రమేశ్, శ్రీనివాస్‌రావు, మాజీ ఉప సర్పంచ్ కుమారస్వామి, ప్రకాశ్ ఉన్నారు.

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన జర్నలిస్ట్ బాల్నే తిలక్‌బాబు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మండల కేంద్రానికి చెందిన హైదరాబాద్ ఇంటలిజెన్స్ డీఎస్పీ గొరోజు రాజేంద్రప్రసాద్, మైలారం గ్రామానికి చెందిన ఏసీపీ చల్లా దేవేందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. వారి వెంట మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు డీటీ రెడ్డి ఉన్నారు.

ఆత్మకూరు : మండలంలోని నాగయ్యపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన గుండాల ఎల్లమ్మ కుటుంబాన్ని న్యాయవాది, అసైన్డ్ భూముల సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ పరామర్శించారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులకు రూ.4వేల ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, నాయకులు శ్రీనివాస్, సుదర్శన్, నగేష్, మోహన్, సుధాకర్, నవీన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కాజీపేట అర్బన్: 31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేటలోని దోనగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేపట్టారు. దోనగుట్ట అభివృద్ధికి రూ.54 లక్షల నిధులు కేటాయించినట్లు ఆమె వివరించారు. గోదాదేవి కల్యాణ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాలయ ఆవరణలో గోశాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ మామిండ్ల రాజు, వేల్పుల మోహన్‌రావు, వెంకన్న, రమేష్ పాల్గొన్నారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఇద్దరు పరిశోధకులు బి.ప్రభాకర్, కుమారస్వామికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఎ స్టడీ ఆన్ ఎఫెక్ట్ ఆఫ్ సర్క్యూట్ ట్రైనింగ్ ఆన్ వేరియాస్ స్కిల్స్ ఆఫ్ కబడ్డీ ప్లేయర్స్ ఆఫ్ వరంగల్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ప్రభాకర్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. వరంగల్ కిట్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి పర్యవేక్షణలో ప్రభాకర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, ఏ స్టడీ ఆన్ ఎఫెక్ట్ ఆఫ్ పాలీమెట్రిక్ ట్రైనింగ్ ఆన్ సెలెక్టెడ్ మోటార్ ఫిట్‌నెస్ అండ్ సైకాలజికల్ వేరియబుల్స్ ఆఫ్ కబడ్డీ ప్లేయర్స్ అనే అంశంపై విశ్రాంత ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కుమారస్వామి కి డాక్టరేట్ ప్రదానం చేశారు.

పిండివంటల ఘుమఘుమలు

- పల్లెల్లో మొదలైన సంక్రాంతి సందడి
- గాలిపటాలు ఎగురవేస్తూ పిల్లల కేరింతలు
- పట్టణాల నుంచి పల్లెలకు తరలిన జనం



పిండివంటకాలు చేస్తున్న మహిళ

ఎల్కతుర్తి : సంక్రాంతి పండుగ అంటేనే ముందుగా గుర్తుకొచ్చేవి పిండివంటలు. ఈ పండుగకు నోరూరించే సకినాలు, గ్యారలు, మురుకులు ప్రతి ఇంటా ఘుమఘుమలతో నోరురిస్తున్నాయి. ఈనెల 13భోగి, 14న సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లోని వివిధ గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో విద్యార్థులంతా వసతి గృహాల నుంచి స్వగ్రామాలకు చేరుకున్నారు. దీంతో పిల్లలు, పెద్దలు కలిసి సంక్రాంతి సంబురాల్లో మునిగిపోతున్నారు. దీంతో గ్రామాల్లోని పిండిగిర్నిల వద్ద మహిళలు క్యూలు కడుతున్నారు. తీపికి గుర్తుగా అర్శలు, కర్శలు, గవ్వలను అల్లి చక్కెర పానకంలో తీసి తియ్యటి పిండి వంటకాలను తయారు చేసుకుంటున్నారు. పెద్దలు పిండివంటలు చేస్తుండగానే పిల్లలు సకినాలను జేబుల్లో నింపుకొని సందడి చేస్తున్నారు. సోమవారం భోగి పండగ కావడంతో మహిళలు, యువతులు తమ ఇళ్ల ముందు పల్లాకి చల్లి కలర్‌ఫుల్ రంగవల్లులు వేసి వాటిపై ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలు పొందుపర్చేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో గ్రామాల్లో సంక్రాంతి సంబురాలు ప్రారంభమయ్యాయి. పిల్లలు గాలిపటాలు ఎగువేస్తూ కేరింతలు కొడుతున్నారు. దీంతో మండల వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది.



పిండితో పోసిన సకినాలు



తయారైన మురుకులు

ప్రజా ప్రభుత్వంలో పేదలకు న్యాయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : ప్రజా ప్రభుత్వంలో నిరుపేదలకు న్యాయం జరుగుతోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని గోవిందాపూర్‌లో మంచినీటిబావికి రూ. 2.20 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటారును ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో 24 మంది లబ్ధిదారులకు రూ.7లక్షల 3వేల 500 విలువచేసే సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తుందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరభద్రుడికి లక్ష బిల్వార్చన



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఉదయం లక్ష బిల్వదళాలతో స్వామి వారి నామాలను అర్చించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, నిత్య హోమాలు జరిగాయి. సాయంత్రం మండప పూజ, మహన్యాసం, మహాలింగార్చన, జ్యోతి లింగార్చన, బిల్వార్చన పూర్వక హారతి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అర్చకులు నందనం వినయ్‌శర్మ, అర్చకులు రాంబాబు, శ్రీకాంత్, వీరభద్రయ్య, రమేశ్, చరత్‌చంద్ర, రవిశర్మ, సందీప్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు నిబంధనలు వద్దు

ఐనవోలు : ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో లబ్ధి పొందాలంటే ఉపాధి హామీలో 20 రోజులు పనిచేయాలనే నిబంధన పెట్టొద్దని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కాడబోయిన లింగయ్య ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు భూమి లేని నిరుపేదలకు రూ.12 వేలు ప్రతి సంవత్సరానికి అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 20 రోజులు ఉపాధి హామీలో పనిచేసిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా రూ. 12 వేలు ఇస్తామనడం సరికాదని తెలిపారు. ఇలాంటి షరతుల వలన నిరుపేదలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు.

జాగ్రత్తగా ఉండాలి

శాయంపేట : సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటికి తాళం వేసి పొరుగూరికి వెళ్తున్న మండల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై పరమేశ్ సూచించారు. ఇంట్లోని బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను వెంట తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఆయిల్‌పామ్ తోట దహనం

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డికి చెందిన ఆయిల్‌పామ్ తోటను అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మోరే శ్రీనివాస్ దహనం చేశాడని ఆరోపిస్తూ బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు. ఈ మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జయప్రదం చేయాలి

దామెర : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వెయ్యి గొంతులు, లక్ష డప్పులు సభను విజయవంతం చేయాలని డప్పు కళాకారుల సంఘం మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో డప్పు కళాకారులు ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం మండల ప్రధానకార్యదర్శి బుర్ర రాజశేఖర్, సుధాకర్, యాకూబు, సతీష్, అజయ్, కోటి, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

జాతర నిర్వహణకు భారీ బందోబస్తు

- సీఐ రంజిత్‌రావు



బందోబస్తును పరిశీలిస్తున్న సీఐ రంజిత్‌రావు

దామెర : మండలంలోని ఊరుగొండ గ్రామంలో జరుగుతున్న లక్ష్మీనరసింహ స్వామి జాతర నిర్వహణకు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ రంజిత్ రావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఎస్సై అశోక్‌తో కలిసి జాతర పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. భక్తుల కోసం క్యూ లైన్లు, పార్కింగ్ స్థలాలు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అర్చకుడు శ్రీనివాసాచార్యులు, సిబ్బంది ఉన్నారు.

శాయంపేట : క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందని సీఐ రంజిత్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని రైజింగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదివారం పోలీస్ అండ్ ప్రెస్ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు బానిసై తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. విద్యార్థులు, యువకులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పొంపెందుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, స్నేహపూర్వకంగా మెలగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శాయంపేట, దామెర ఎస్సైలు జక్కుల పరమేశ్, అశోక్, ఏఎస్సై కుమారస్వామి, పోలీస్ సిబ్బంది, పలువురు పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రియాంకాగాంధీ జన్మదిన వేడుకలు

ఏఐసీసీ అగ్రనేత, వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. - సాక్షి నెట్‌వర్క్



కమలాపూర్ : కేక్ కట్‌చేస్తున్న నాయకులు



పరకాలలో..



ఎల్కతుర్తి : కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

వివేకానందుడి బోధనలు ఆచరించాలి

స్వామి వివేకానందుడి బోధనలను ప్రతిఒక్కరూ ఆచరించాలని యువజన కాంగ్రెస్, వివేకానంద ఉత్సవ కమిటీ, బీజేపీ నాయకులు సూచించారు. వివేకానందుడి జయంతిని ఆదివారం వేర్వేరుగా నిర్వహించారు. పూలమాల వేసి నివాళులర్పించారు. - సాక్షి నెట్‌వర్క్



కమలాపూర్ : వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



ఆత్మకూరు : వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న విజయచందర్‌రెడ్డి



దామెరలో..

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- తహసీల్దార్ సత్యనారాయణ



శాయంపేట : ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్న సందర్భంగా మండలంలో చేపట్టిన సర్వే పారదర్శకంగా చేపట్టినట్లు తహసీల్దార్ సత్యనారాయణ స్పష్టం చేశారు. సర్వేలో భాగంగా పంచాయతీ కార్యదర్శి రత్నాకర్‌కు మండల కేంద్రంలో 1,869 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా 75 మందిని గుర్తించి ఇంటింటికి వెళ్లి పరిశీలించామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం గుర్తించిన లబ్ధిదారుల్లో 55మంది దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్లు ఆయన వెల్లడించారు. సర్వేలో ఎలాంటి తారతమ్యం లేకుండా చట్టపరిధిలో కొనసాగిస్తున్నామని ఆయన అన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ



రక్తదానం చేస్తున్న యువకులు

కమలాపూర్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర, ఆపద సమయాల్లో ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ సూచించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రగతి యువజన సంక్షేమ సంఘం, ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన ఈ మెగా రక్తదాన శిబిరంలో 50 మందికి పైగా యువకులు రక్తదానం చేయగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌వారు దాతల నుంచి రక్తం సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఏడాది జనవరి 12న జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ప్రగతి యూత్, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వరుణ్ మాధవ్, ప్రియాంక, కుమారస్వామి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పబ్బు సతీష్, యూత్, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు బాలసాని కుమారస్వామి, పబ్బు అశోక్, గౌరవ అధ్యక్షుడు బాలసాని దేవేందర్‌గౌడ్, సభ్యులు జక్కు కృష్ణమూర్తి, చరణ్, ఓదెలు, కుమారస్వామి, ప్రభాకర్, సుందర్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న చందా మల్లయ్య

దామెర : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలీలు సత్తా చూపాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు చందా మల్లయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మండల పద్మశాలీ సంఘం సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. గ్రామస్థాయిలో సభ్యత్వాన్ని ప్రారంభించి అత్యధిక సభ్యత్వాలు చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి దుబాసి అనిల్, జిల్లా కార్యదర్శి గడ్డం రమేశ్, సదానందం, శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు.

కొత్తకొండ జాతరకు తరలిన ప్రభబండ్లు



ప్రభబండ్లతో తరలివెళ్తున్న దామెరుప్పుల వంశస్తులు

దామెర : ప్రముఖ శైవ క్షేత్రమైన కొత్తకొండ వీరభద్ర స్వామి జాతరకు మండల కేంద్రం నుంచి ఆదివారం సాయంత్రం ప్రభ బండ్లు తరలివెళ్లాయి. మండల కేంద్రానికి చెందిన దామెరుప్పుల వంశస్తులు వీరబోనం, ప్రభబండ్ల ద్వారా తీసుకువెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన అనంతరం జాతర ప్రారంభమవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో మండల కేంద్రానికి చెందిన దామెరుప్పుల వంశస్థులు జోడెడ్లతో ప్రభబండ్లు తయారు చేసుకొని కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి మండల కేంద్రం నుంచి ర్యాలీగా తరలివెళ్లారు. కోరిన కోర్కెలు తీర్చే వీరభద్ర స్వామికి గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, తాము పండించిన ధాన్యాన్ని తీసుకుని దామెరుప్పుల వంశస్థులు తదితరులు తరలివెళ్లారు.

జాతరలో అధికారుల నిరంతర సేవలు



బ్లీచింగ్ చల్లిస్తున్న డీఎల్‌పీఓ గంగా భవాని



తాగునీటిని క్లోరిన్ టెస్టు చేస్తున్న మిషన్ భగీరథ ల్యాబ్ అధికారులు



పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న డీసీపీ రవీందర్

ఐనవోలు: మల్లికార్జునస్వామి జాతరలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది నిరంతర సేవలు అందిస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు తాగునీటిని ప్రతిగంటకు ఒకసారి పరిశీలించి క్లోరినేషన్‌ను రికార్డు చేస్తున్నారు. సాధారణంగా 0.2 పీపీఎం నుంచి 2.0 పీపీఎం వరకు క్లోరినేషన్ ఉండాలి. ప్రస్తుతం తాగునీటి కోసం ఏర్పాటు చేసిన 4 పాయింట్ల వద్ద 0.5 నుంచి 1 పీపీఎం వరకు ఉందని అధికారులు తెలిపారు. డీపీఓ లక్ష్మీరమాకాంత్, డీఎల్‌పీఓ గంగా భవాని పర్యవేక్షించి నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ చల్లించారు. ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూపర్‌వైజర్లకు సూచించారు. ఆర్డీఓ రమేశ్ రాథోడ్ పర్యవేక్షించి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న తహసీల్దార్ విక్రమ్ కుమార్‌కు పలు సూచనలు చేశారు. ఈస్ట్‌జోన్ డీసీపీ పులిగిల్ల రవీందర్ జాతరలో విధులు నిర్వర్తించేందుకు వచ్చిన 349 పోలీసు అధికారులు, సిబ్బందికి మల్లికార్జునస్వామి ఫంక్షన్‌హాల్‌లో వసతి కల్పించారు. అలాగే, 108 వాహనాన్ని ఆలయ ప్రాంగణంలో సిద్ధంగా ఉంచినట్లు వైద్యారోగ్య శాఖ అధికారులు తెలిపారు. దొంగతనాలు జరగకుండా ఈసారి 12 పార్కింగ్ స్థలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కమలాపూర్ : పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు



పరకాలలో..

కమలాపూర్ : కమలాపూర్‌లో 1994-95, భీంపల్లిలో 2003-04 మర్రిపల్లిగూడెంలో 2004-05 సంవత్సరాల్లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు ఘనంగా జరుపుకొన్నారు. బాల్య మిత్రులను కలిసి ఆప్యాయంగా పలకరించుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. బైక్‌లపై ర్యాలీగా వెళ్లి తాము చిన్ననాట చదువుకున్న పాఠశాల ఆవరణలో కలియ తిరుగుతూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. విశ్రాంత ఎంఈఓ సుఖదేవ్, విశ్రాంత ఉపాధ్యాయులు ఎడ్వర్డ్, సత్యనారాయణ, నర్సింహారెడ్డి, నారాయణ, రాజమౌళి, డేవిడ్, పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, రాంబాబు, శివకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పరకాల : పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో 1990 నుంచి 2000 సంవత్సరం వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు సందడి చేశారు. తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ ప్రధానాచార్యులు కాశీవిశ్వనాథం, ఆచార్యులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.